క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలి

గోస్పాడు: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ అన్నారు. బుధవారం వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకొని స్థానిక ఆ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైపుణ్యాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతించిన మందులనే వినియోగించాలి



మాట్లాడుతున్న ఏఓ ప్రమీల

దొర్నిపాడు: రైతులకు తప్పని సరిగా ప్రభుత్వం అనుమతించిన పురుగు మందులనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల ఎరువుల దుకాణాల యజమానులకు సూచించారు. బుధవారం ఆమె స్థానిక రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. దుకాణాల్లో తప్పని సరిగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు విక్రయించే ప్రతి కొనుగోలుపై బిల్లు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలన్నారు. యూరియా కొరత ఏర్పడకుండా నానో యూరియా, డీఏపీలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

సచివాలయ ఉద్యోగులకు వీడ్కోలు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు గంగాధర్, ఉజ్మా, ఉసేనమ్మ, రంగారెడ్డి, మాణిక్యమ్మ, గీతలను గ్రామస్తులు వెంకటరామిరెడ్డి, కట్టుబడి బాషా, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, ఓబులేసు బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సాంబశివుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసు, సొసైటీ మాజీ డైరెక్టర్ ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి ఈఓగా తేజేశ్వరి

చాగలమర్రి: మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా తేజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీలో ఈఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఈఓగా పని చేస్తున్న సుదర్శన్‌రావు ఏడాది క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న తాహెర్ హుసేన్‌ను జిల్లా అధికారులు ఇన్‌చార్జ్‌గా నియమించిన విషయం తెలిసిందే.

ప్లాస్టిక్ పొల్యూషన్‌పై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ప్లాస్టిక్ పొల్యూషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థులు సమగ్ర పాత్ర పోషించాలన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, విజయానంద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల గ్రామ సమీపంలో రైతు శ్రీకాంత్ రెడ్డి పొలంలో బావిగట్టున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతదేహంపై ఎలాంటి మచ్చలు లేవని, గల్ల చొక్కా, పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిస్తే సెల్ : 91211 01172, 91211 01091 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

అందుబాటులో ఉండండి

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మాయలూరు రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల్లో భాగంగా మండలంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. వారి స్థానంలో విధుల్లో చేరిన ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో మినుము, కంది మినీ కిట్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీత, రాణెమ్మ పాల్గొన్నారు.

శిథిల భవనాల్లో మూగవేదన



శిథిలావస్థకు చేరిన బిల్లలాపురం పశువైద్య శాల (ఇన్‌సెట్‌లో) పెచ్చులూడిపోయిన భవనం పైకప్పు.



ఎద్దుకు చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

నంద్యాల(అర్బన్): జిల్లాలో పశువైద్యశాల భవనాలు అధ్వానంగా మారాయి. మొత్తం 116 ఉండగా అందులో కొన్ని మరమ్మతులకు నోచుకోక, మరికొన్ని శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని అధికారులు, ప్రజాప్రతినిధులెవ్వరూ పట్టించుకోకపోవడంతో వాటిలోనే మూగజీవాలకు సేవలందించాల్సిన దుస్థితి నెలకొంది. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో 1980లో గ్రామీణ పశువైద్యశాల ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వానకు కారడంతో పాటు పైకప్పుల పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియక లైవ్ స్టాక్ అసిస్టెంట్ విజయసింహారెడ్డి బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో దాదాపు 550 నుంచి 650 వరకు పశుసంపద ఉంది. భవనం శిథిలావస్థకు చేరడంతో వాటికి ఆసుపత్రి ఆవరణలోనే వైద్యసేవలు అందించి పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాలకు మరమ్మతులు లేదా నూతన భవన నిర్మాణం చేపట్టాలని పాడిరైతులు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటసుబ్బయ్య, తదితరులు కోరుతున్నారు.

మీ పిల్లలను పంపితే బడిని కొనసాగిస్తాం



కొండుపల్లెలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ 1 రఘురామిరెడ్డి

ఉయ్యాలవాడ : మీ పిల్లలను మీ ఊరిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే బడిని కొనసాగిస్తామని ఎంఈఓ 1 రఘురామిరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పారు. బుధవారం మండలంలోని కొండుపల్లె, ఆర్.జంబులదిన్నె ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. కొండుపల్లె ప్రాథమిక స్పెషల్ పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపితే స్థానికంగా ఉన్న ప్రభుత్వ బడిని కొనసాగించడం కుదరదన్నారు. ప్రస్తుతం పాఠశాలకు ముగ్గురు విద్యార్థులు మాత్రమే వస్తున్నారని చెప్పారు. అనంతరం తల్లిదండ్రులతో తీర్మానం చేయించి ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపేలా సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

నంద్యాల(న్యూటౌన్): తాగునీటి కోసం నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం గోపాల్ నగర్ వాసులు ధర్నా నిర్వహించారు. గత వారం రోజులుగా మంచినీరు రాకపోవడంతో ఆ ప్రాంత మహిళలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. గోపాల్‌నగర్ వార్డు ఇన్‌చార్జి సాయినాథరెడ్డి, సరస్వతి నగర్ కౌన్సిలర్ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గోపాల్ నగర్ వాసులకు మంచినీరు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్‌ను కలిసి సమస్య విన్నవించగా వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీచ్చారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 30, 31వ తేదీన డోన్‌లో జరిగే సీపీఐ నంద్యాల జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సీపీఐ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఆవిర్భావం నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం, భూమి కోసం, ముక్తి కోసం, విముక్తి కోసం సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. ఆహార భద్రత చట్టం తీసుకొని రావడంలో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, సమానత్వం కోసం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, సుశీలమ్మ, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని మంత్రి పదవి నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న హుసేన్

నంద్యాల(అర్బన్): ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి తీర్మానాన్ని పంపడాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హుసేన్, జాయింట్ సెక్రటరీ సుభాన్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని కోరారు. అనేక మంది ముస్లింలు బీజేపీలో ఉన్నారనే విషయం ఆయన గుర్తించుకోవాలన్నారు. వెంటనే మంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అహమ్మద్‌హుసేన్, ఇక్బాల్, యూనిస్, తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులపై చంద్రబాబు నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాంత రైతాంగం పట్ల, ఇక్కడి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంపై అభిమానం ఉంటే వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన బలవంతపు భూసేకరణపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ శక్తులకు అప్పనంగా రైతుల భూములు అప్పజెబుతున్నారన్నారు. జిల్లాలో పొగాకు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పొగాకు రైతుల సమస్యపై స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో పొగాకు పండించారని, ప్రస్తుతం వాటి కొనుగోలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14వేల కోట్లు ఖర్చు చేస్తే 14 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉందని, దీనిని వదిలేసి రూ.81కోట్లు ఖర్చు చేసి గోదావరి నుంచి బానకచర్లకు నీరు రప్పించి రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని మభ్యపెట్టడం సరికాదన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ పనులు నిలిపివేత



అప్పనపల్లె సమీపంలో కాంట్రాక్టర్ కూల్చిన వృక్షాలు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలో తెలుగుగంగ కాల్వ కట్టలపై సాగుతున్న మరమ్మతు పనులను బుధవారం అటవీ అధికారులు నిలిపేశారు. రుద్రవరం రేంజ్ ఇన్‌చార్జ్ అధికారి ముర్తుజా విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుగంగ ప్రధాన కాల్వతో పాటు పలు ఉప ప్రధాన కాల్వలు అటవీ ప్రాంతంలో ఉన్నాయని, వాటిపై ఏవైనా అభివృద్ధి పనులు చేసే ముందు సంబంధిత అధికారులు ,కాంట్రాక్టర్లు ముందుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరిశీలించి పచ్చదనానికి ప్రమాదం లేదని తెలిస్తే అనుమతులు ఇస్తామన్నారు. అయితే, కొద్ది రోజులుగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా 18,19 బ్లాక్ ఉప ప్రధాన కాల్వల కట్టలపై ఉన్న వృక్ష సంపదను యంత్రాలతో కోసి పక్కన పారవేశారన్నారు. ఈ విషయం తెలియడంతో పనులను నిలిపేసినట్లు తెలిపారు. వృక్షాల కూల్చివేతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

19న ప్రత్యేక విద్యుత్ అదాలత్

నంద్యాల(అర్బన్): స్థానిక విద్యుత్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ ఆవరణలో ఈనెల 19న (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మితో నిర్వహించబడే విద్యుత్ అదాలత్‌లో వినియోగదారుల సమస్యలను వివరించవచ్చని సూచించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థకు చెందిన ఎస్‌ఈ, ఈఈలు, అకౌంట్ ఆఫీసర్లు, డివిజన్ పరిధిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఏఈలు, తదితరులు హాజరవుతారన్నారు. డివిజన్ పరిధిలోని మండలాలు(నంద్యాల రూరల్, మహానంది, బండి ఆత్మకూరు, వెలుగోడు, పాణ్యం, గడివేముల) విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను రాతపూర్వకంగా తెలియజేస్తే పరిష్కార మార్గాలు తెలపబడుతాయన్నారు.

సీమకు ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): రాయలసీమ అభివృద్ధి చెందాలంటే సీమ ప్రాంతానికి ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సాగునీటి రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట లక్ష్యంతో కార్యాచరణ చేపడితే సీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సీమలోని సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించకపోవడం అన్యాయమన్నారు. రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధికి సమగ్ర విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈఓపీఆర్డీగా నాగలక్ష్మమ్మ

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయానికి ఈఓపీఆర్‌డీగా నాగలక్ష్మమ్మను నియమించారు. జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఈమెను పదోన్నతిపై ఉయ్యాలవాడకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు పాణ్యం మండల కేంద్రానికి గత నెల జూన్ 11న బదిలీ అయినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం సన్మానం జరిగింది. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సర్పంచు అయ్యలూరి సుభహాన్, కార్యదర్శి అశ్వనికుమార్ కార్మికులను సన్మానం చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయాలన్నారు. అధికారులు, ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్‌కు నిధులు విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అలగనూరు రిజర్వాయర్‌కు ప్రభుత్వం రూ.32 కోట్లు విడుదల చేసి తాగు, సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2017 నుంచి రిజర్వాయర్ నిరుపయోగంగా ఉందన్నారు. మరమ్మతులకు చంద్రబాబు నిధులు విడుదల చేశాకే నందికొట్కూరుకు రావాలని, లేని పక్షంలో పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.

పేద కుటుంబాల అభివృద్ధే లక్ష్యం

చాగలమర్రి: ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేద కుటుంబాలను అభివృద్ధి చేయడమే పీ-4 ధ్యేయమని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయకుమార్ అన్నారు. బుధవారం చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద డిప్యూటీ ఎంపీడీఓ తాహెర్ హుసేన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పీ-4 గ్రామ సభలో సర్పంచ్ తులసమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మార్గదర్శకుల ద్వారా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవనోపాధిని మెరుగుపరచడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గర్భిణుల నమోదు తప్పనిసరి

చాగలమర్రి: 12 వారాలలోపు గర్భిణుల నమోదు తప్పని సరిగా చేయాలని నంద్యాల జిల్లా ప్రోగ్రాం వైద్యాధికారి అంకిరెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రమైన చాగలమర్రి పీహెచ్‌సీని, అలాగే 1,2,3వ సచివాలయాల పరిధిలో ఉన్న హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శివరామయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు సురేంద్రబాబు, మహబూబ్ హుస్సేన్, విష్ణుప్రియ, ఏఎన్‌ఎంలు నర్సమ్మ, గార్లెట్, వసంత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రామునాయక్

నంద్యాల: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ పరిశ్రమల నిర్వాహకులు, అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ముందుగా డిస్ట్రిక్ట్ ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించినప్పుడు సంబంధిత అధికారులందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పీహెచ్‌సీల పరిధిలో ఎటువంటి పరిశ్రమలు ఉన్నాయి, అందులో ఏ విధమైన రసాయనాలు తయారు చేస్తారు అనే దానిపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిశ్రమల్లో కాలం చెల్లిన అగ్నిమాపక పరికరాలను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆటో అలారం, వర్క్ పర్మిట్ సిస్టమ్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పరిశ్రమలు నియమనిబంధనల మేరకు ఎన్ని నిర్వహిస్తున్నారు, అందులో పాటిస్తున్న భద్రతా ప్రమాణాల గురించి పూర్తి స్థాయిలో వివరించారు. అదే విధంగా పరిశ్రమల చుట్టూ ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రమాద నివారణలో భాగంగా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



చాగలమర్రిలోని దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

శిరివెళ్ల: ఎరువుల దుకాణాలపై బుధవారం రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. సహాయ వ్యవసాయ సంచాలకుడు కమలాపురం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు శిరివెళ్ల మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఎరువుల దుకాణం తనిఖీ చేసి రూ. 3.52 లక్షల విలువ చేసే ఎరువుల బస్తాల అమ్మకాలను నిలిపివేశారు. ఎరువుల నిల్వల చూపు రికార్డులు సరిగా లేవని చెప్పారు. అలాగే శ్రీ కాంత్ ట్రేడర్స్‌లో 6.61 లక్షలు విలువైన ఎరువుల బస్తాల అమ్మకాలను నిలిపి వేశారు. సహాయ సంచాలకుడు మాట్లాడుతూ విత్తన , ఎఫ్‌సీఓ 1985 చట్టం ప్రకారం వ్యాపారాలు చేయాలన్నారు. ప్రతి రోజు గోదాములలో నిల్వలను మండల వ్యవసాయ అధికారులకు తప్పకుండా తెలియ జేయాలన్నారు. స్టాక్ బోర్డులను అప్‌డేట్ చేయాలని, ఎమ్మార్పీకి ఎరువులు, క్రిమి సంహారక మందులను విక్రయించాలని . ప్రతి రైతుకు విధిగా కొనుగోలు రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి పొందిన ఎరువులు, క్రిమి సంహారక మందులను మాత్రమే అమ్మాలన్నారు. జిల్లాకు కేటాయించిన ఎరువులను ఆ జిల్లాలోనే విక్రయించాలన్నారు. చట్టాని ఉల్లఘించి ఎవరైనా వ్యాపారాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరుగుతాయన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ గోపాలుడు, ఏడీఏ విజయశేఖర్, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

రుద్రవరం: రసాయన ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యవసాయ శాఖ రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం సహాయ సంచాలకులు కమలాపురం నరసింహారెడ్డి హెచ్చరించారు.మండల కేంద్రమైన రుద్రవరంలోని పలు రసాయన ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బుధవారం వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన ఆయా దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లతో పాటు వివిధ రకాల అనుమతి పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కృత్రిమ కొరత సృష్టించవద్దని హెచ్చరించారు.అలాగే నాణ్యమైన ఎరువులను విక్రయించాలని చెప్పారు. అలా విక్రయించిన వాటికి తప్పకుండా రశీదులు ఇవ్వాలన్నారు.ప్రతి షాపులో స్టాక్ బోర్డు, బిల్లు బుక్స్, స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యుడు ఎస్‌ఐ గోపాలుడు, ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌శేఖర్, రుద్రవరం ఏఓ సుమతి, ఏఈఓలు రాజు, ఫహీమా తబస్సుమ్ ఉన్నారు.

- చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని విత్తన, ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయ దుకాణాలపై బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్ నిల్వలకు సంబంధించిన రికార్డులు సరిగ్గా లేకపోవడంతో రూ.2.34 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు ఏఓ రంగనేతాజి తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



ఆర్.జంబులదిన్నెలో నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

ఉయ్యాలవాడ: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్ కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం ఉయ్యాలవాడ రెవెన్యూ కార్యాలయ ఆవరణలో, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఉయ్యాలవాడ మండలానికి 15 మరుగుదొడ్లు మంజూరు కాగా ఆర్.జంబులదిన్నె, రెవెన్యూ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మరో మూడు చోట్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆళ్లగడ్డ మండలానికి 7 మంజూరు కాగా మూడు చోట్ల, చాగలమర్రి మండలానికి 20 మంజూరు కాగా 8 చోట్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నట్లు వెల్లడించారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ప్రభుత్వ కార్యాలయాలకు కనీసం అవసరాల నిమిత్తం ప్రభుత్వం వీటిని మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 3 లక్షలు వ్యయం చేస్తున్నట్లు డీఈ వెల్లడించారు. మిగతా చోట్ల వచ్చే నెల ఆగస్టు 15 నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఏఈ ఫణీత్‌క్రిష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు త్వరగా పరిష్కారం



ర్యాలీలో పాల్గొన్న జడ్జిలు, న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా 90 రోజుల్లో పరిష్కారం లభిస్తుందని మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజ, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, రెండో అదనపు జిల్లా జడ్జి కిరణ్‌కుమార్, స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం పేర్కొన్నారు. బుధవారం కోర్టు ఆవరణ నుంచి పద్మావతి నగర్ వరకు వన్‌కే ర్యాలీని న్యాయవాదులు, ప్రజా సంఘాలు, న్యాయ పరిరక్షణ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా రాజీపడితే డబ్బు ఆదా అవుతుందని అన్నారు. కేసుల రాజీకి ప్రత్యేకంగా శిక్షణ పొందిన న్యాయవాదులను నియమించామని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఈ ర్యాలీ టెక్కె కూడలి వరకు కొనసాగింది. మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ప్రజలకు మధ్యవర్తిత్వంపై కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారావు, సాయిస్వరూప్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాషా, వివేకానందరెడ్డి, ముక్కెర కృష్ణారెడ్డి, పీపీ శ్రీనివాసులు, రాజేశ్వరరెడ్డి, మురళీ, అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు, గోళ్ల జయకృష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి, తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో నైపుణ్య దినోత్సవంలో విద్యార్థులు

రుద్రవరం: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బషీర్ అహమ్మద్ అన్నారు. మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీమోడల్ పాఠశాలలో బుధవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో విద్యార్థిలో ఓ కళ ఉంటుందన్నారు.అలాంటి కళ ఉన్నవారంతా దానిని ప్రదర్శించి మంచి పేరు గడించాలన్నారు. ఐటీ,అగ్రికల్చర్,వృత్తి నైపుణ్య కోర్సుల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐటీ ట్రైనర్స్ జ్యోతిప్రియ, హరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యత అవసరం

దొర్నిపాడు: విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యత చాలా అవసరమని హెచ్‌ఎం చెన్నకేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, పోటీలు నిర్వహించారు. ఒకేషనల్ విద్యావిధానం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఒకేషనల్ విద్యను అభ్యసించాలన్నారు. చాలా మంది ఉన్నత చదువులు అభ్యసించినప్పటికీ నైపుణ్యత లేక కొలువులకు దూరమవుతున్నారన్నారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు రాముడు, అర్షియా, సాయి క్రిష్ణ, ఉపాధ్యాయులు మౌలాలి, రమణయ్య, పీడీ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.